## క్లుప్తంగా

### డీఎస్సీ అభ్యర్థులకు భోజన వసతి

పెద్దదోర్నాల: 2025 డీఎస్సీలో ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు నియామకపత్రాలు అందుకునేందుకు బుధవారం అమరావతి తరలి వెళ్లారు. కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 3,750 మంది నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులతో పాటు వారి గార్డియన్లు మరో 3,750 మంది మొత్తం 150 బస్సుల్లో అమరావతి తరలివెళ్లారు. మార్గమధ్యంలో మధ్యాహ్నం వారికి అధికారులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్సీ బాలుర గురుకుల వసతి గృహాల్లో భోజన వసతిని ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లా డీఈఓ జనార్దనరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

### ఓట్ల దొంగలు గద్దె దిగాలి



దర్శిలో సంతకాలు సేకరిస్తున్న కృష్ణారెడ్డి

దర్శి: ఓటర్ల జాబితాలో అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్త ఉద్యమంలో భాగంగా దర్శిలో బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ దర్శి నియోజకవర్గ సమన్వయకర్త కైపు వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 50 వేల సంతకాల సేకరణ చేసి ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ప్రతి పౌరుడికి తన ఓటు హక్కును వినియోగించుకునేలా చైతన్యం తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఓటర్ గళాన్ని ఎన్నికల సంఘానికి తెలిపే విధంగా ఈ సంతకాల సేకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ దర్శి మండల అధ్యక్షుడు శ్రీరామిరెడ్డి, దర్శి మండల పరిశీలకుడు ఇరికినేని వెంకట నరసయ్య, దర్శి పట్టణ అధ్యక్షుడు పౌలేష్, తాళ్లూరు మండల అధ్యక్షుడు కోకట్ల వీరబ్రహ్మం, నాయకులు కమల్ సాయిబ్, దాసరి వెంకయ్య, వెంకటేశ్వర్లు, తిరుపతమ్మ, రమేష్, జకరయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



జ్వరంతో మంచానపడిన నల్లదిమ్మె దాసిరెడ్డి



జ్వరంతో మంచానపడిన వృద్ధురాలు పిచ్చమ్మ



తమ్మడపల్లిలో రోడ్డుపై మురుగు నీరు



పాతంపల్లిలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు నీరు

# పల్లెల్లో జ్వరాల కలవరం

- పట్టించుకోని పంచాయతీశాఖ అధికారులు
- రోడ్లపై మురుగునీరు నిలిచి దుర్గంధం
- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు



పాతంపల్లిలో ఇంటిలోనే సెలైన్ బాటిల్ పెట్టించుకున్న రాములమ్మ

పెద్దారవీడు: ఇటీవల కురిసిన వర్షాలకు పారిశుద్ధ్య లోపంతో దోమలు వ్యాప్తి చెంది విష జ్వరాలు ప్రబలాయి. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండి తీవ్ర దుర్గంధం వెదజల్లి స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇంటికి ఒకరు చొప్పున జ్వరంతో బాధ పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మండలంలో పాతంపల్లి, తమ్మడపల్లి, దేవరాజుగట్టు, సానికవరం, బద్వీడుచెర్లోపల్లి, తదితర గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మరి కొన్ని చోట్ల తాగునీరు కలుషితం కావడంతో రోగాలు ప్రబలుతున్నాయి.

**పీహెచ్‌సీలలో అందని వైద్యం..**

పోతంపల్లి గ్రామంలో దుద్దె కుంటిఅంకిరెడ్డి, దుద్దెల రాములమ్మ, నలదిమ్మె వెంకటరమణ, జిల్లె సుబ్బారెడ్డి, నల్లదిమ్మె దాసిరెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, మరి కొంత మంది జ్వరాలతో మంచాన పడ్డారు. సమీపంలో ఉన్న చట్లమిట్ల ప్రాథమిక ఆరోగ్యం కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది విధులకు సక్రమంగా రావడంలేదని ప్రజలు అంటున్నారు. చికిత్స కోసం వెళితే అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది స్పందించడంలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమయానికి వైద్యశాలకు రాకపోవడంతో పాటు రక్త పరీక్షలు, వైద్య పరీక్షలు చేసి వారు లేరని ఒకరిపై ఒకరు సమాధానం సిబ్బంది చెప్పడంతో రోగులు వెనుదిరిగి వెళ్తున్నారు. హనుమాన్‌జంక్షన్‌కుంట, సానికవరం, కొచ్చర్లకోట గ్రామాల్లో ఉన్న ఆర్ఎంపీ వైద్యుల వద్ద చికిత్స పొందుతున్నామని రోగులు తెలిపారు. సీజన్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించకుండా వారి స్వంత పనులు చూసుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత్యంతరం లేని పరిస్థితిలో ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించి చికిత్స కోసం వేలకు వేలు ఖర్చు చేసుకోవాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. ఇంటి వద్దకు ఆర్ఎంపీ వైద్యులను పిలిపించుకొని అదనంగా డబ్బులు ఇచ్చి చికిత్స చేయించుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్య పరీక్షలు నిర్వహించి నాణ్యమైన చికిత్సను అందించాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

**అపరిశుభ్రత తాండవిస్తున్నా పట్టించుకోని పంచాయతీరాజ్ అధికారులు:**

వర్షాకాలంలో దోమల ప్రభావం అధికంగా ఉంటుంది. దోమలు వృద్ధి చెందకుండా ముందస్తు నివారణ చర్యలు తీసుకోవాల్సి ఉండగా పంచాయతీరాజ్ అధికారులు పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. వీధులు, మురికి నీటి కాలువలు, ఇళ్ల పరిసరాల్లో ఫాగింగ్ చేయించాల్సి ఉన్నా నిర్లక్ష్యం చేస్తున్నారు. రోడ్లపై మురుగు నీరు పారుతున్నా, రోడ్ల పక్కన చెత్తకుప్పలు పేరుకు పోయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవట్లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగీ జ్వరాలు క్రమంగా వ్యాపిస్తుండటంతో ప్రజలు మరింత భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో పర్యటించి దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న ప్రజలకు మెడికల్ క్యాంపుల ద్వారా వైద్యసేవలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి

తాళ్లూరు: ప్రతి ఒక్క మహిళా ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సర్పంచులు మారం ఇంద్రసేనారెడ్డి, చిమట సుబ్బారావు సూచించారు. మండలంలోని విఠలాపురం, నాగంబొట్లపాలెం గ్రామాల్లో బుధవారం డాక్టర్లు ప్రవీణ్‌కుమార్, మౌనిక స్వస్థనారి స్వశక్తి పరివార్ అభినయ్ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచులు పాల్గొని మాట్లాడుతూ క్యాన్సర్ పరీక్షలు చేయించుకుని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆహార అలవాట్లు, పిల్లలకు వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల విద్యార్థి విభాగం అధ్యక్షుడు కైపు అశోక్‌రెడ్డి, గ్రామ నాయకులు జస్టి నరసింహారావు, పి.రమేష్, హాస్పిటల్స్ సిబ్బంది హెచ్ఈఓ చంద్రశేఖరరావు, ఎంపీ రవణమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## మాకు న్యాయం చేయండి సార్



తహసీల్దార్ రమణారావుకు అర్జీ అందజేస్తున్న ఏకలవ్యనగర్ వాసులు

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడు రెవెన్యూ పరిధిలోని ఏకలవ్యనగర్ ఎస్టీకాలనీ వాసులు ఎదుర్కొంటున్న భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ బీవీ రమణారావుని కలిసి విజ్ఞప్తి చేశారు. దాదాపు 37 సంవత్సరాలుగా ఇక్కడ నివాసం ఉంటూడీ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. మూడు దశాబ్దాలుగా అధికారులు పరిశీలన చేస్తున్నారని, కానీ న్యాయం చేయలేదని వాపోయారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో ఏకలవ్యనగర వాసులు పొన్నర్సు వెంకట్రావు, పొన్నర్సు శ్రీను, పొన్నర్సు సురేష్, ఇట్టా వెంకటేశ్వర్లు, ఇట్టా ప్రకాశ్‌రావు, మోట రామారావు తదితరులు ఉన్నారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యం



పోషకాహారం గురించి వివరిస్తున్న సీడీపీఓ పరిమళ

కురిచేడు: మండలంలోని కురిచేడు-1 అంగన్‌వాడీ సెంటర్‌లో సీడీపీఓ ఆర్.పరిమళ ఆధ్వర్యంలో బుధవారం 8వ రాష్ట్రీయ పోషణమాసం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించడం ద్వారా చాలా మంది తల్లులు తమ ఆహారపు అలవాట్లు మార్చుకుని మంచి ఆరోగ్యకరమైన బిడ్డలకు జన్మనిచ్చారని వివరించారు. మనం తీసుకునే ఆహారంలో సమతులనా ఆహారం ఉండేలా చూసుకోవాలని సూచించారు. బిడ్డకు 6 నెలలు నిండేదాకా తల్లిపాలే మంచి పౌష్టికాహారమని తెలిపారు. చిరుధాన్యాలు, తృణధాన్యాలు ఏ విధంగా వాడాలో వివరించారు. మునగాకు పొడి చేసుకుని గర్భిణులు ప్రతిరోజూ ఆహారంలో చేర్చుకోవాలని వివరించారు. అనంతరం అందరిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.సునీత, అంగన్‌వాడీ టీచర్లు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.



కురిచేడులో రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిస్తున్న జ్ఞానప్రసూనాంబదేవి



దర్శి : అన్నపూర్ణాదేవిగా దర్శనమిస్తున్న కనకదుర్గమ్మ తల్లి



దర్శి : అన్నపూర్ణాదేవిగా పూజలందుకుంటున్న పోలేరమ్మ తల్లి



దర్శి : అన్నపూర్ణాదేవిగా దద్దాలమ్మ అమ్మవారు

# భక్తిశ్రద్ధలతో దేవీశరన్నవరాత్రులు

- అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

దర్శి: విజయదశమి పండుగను పురస్కరించుకుని దర్శిలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవార్లను పూలమాలలతో అందంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేశారు. కనకదుర్గమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. కుంకుమ పూజ, అష్టోత్తర శతనామావలి పూజలు చేశారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలో హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. దద్దాలమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని పూలమాలలతో అందంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

**వైభవంగా దేవీశరన్నవరాత్రులు**

దొనకొండ: స్థానిక విరాట్‌నగర్ శ్రీఆనందాశ్రమంలో దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం 3వ రోజు ఉదయం 7 గంటల నుంచి గణపతిపూజ, అమ్మవారికి అమృతాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని లలితాదేవిగా అలంకరించారు. శ్రీగోవిందమాంబ వీరబ్రహ్మేంద్రుల స్వాములవారిని ప్రత్యేకంగా అలంకరించి దూప, దీప మహానైవేద్యం సమర్పించారు. గుట్టమీదపల్లి గ్రామానికి చెందిన బంగారయ్య, నాగమ్మ దంపతులు అమ్మవారికి 11 చీరలు సమర్పించారు. పెదన్నపాలెం గ్రామానికి చెందిన సానికొమ్ము వెంకట ఆంజనేయరెడ్డి అల్పాహారం అందజేశారు.

**రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చిన జ్ఞానప్రసూనాంబదేవి...**

కురిచేడు: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం జ్ఞానప్రసూనాంబదేవి భక్తులకు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. ఆలయ పూజారి కురిచేటి సుబ్బారావు అమ్మవారికి భక్తులచే ప్రత్యేక పూజలు చేయించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

**జగజ్జననికి భక్త నీరాజనం..**

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున క్షీరాభిషేకం, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు బిదరె రాంప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, చండీపారాయణం నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో అమ్మవారికి శ్రీలలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. పోలేరమ్మ ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. నవరాత్రులను పురస్కరించుకుని ఆలయంలో వెలసిన అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు కొండవీటి సుదర్శనాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు.

**గజలక్ష్మి అలంకరణలో రాజ్యలక్ష్మి**

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్ల పంచాయతీ రాజంపల్లి గ్రామం సమీపంలో వెలసిన రాజ్యలక్ష్మి సమేత గొబ్రాలికొండ తిరుమలనాథస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి బుధవారం భక్తులు పూజలు చేశారు. మూడో రోజు రాజ్యలక్ష్మి అమ్మవారు గజలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు భవానీప్రసాద్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారి మూల విగ్రహానికి అభిషేకం, సుగంధ పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయానికి ఉదయం, సాయంత్రం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటున్నారు. ఉభయదాతలుగా శ్రీకృష్ణదేవరాయ కాపు, బలిజ అన్న సత్రం సభ్యులు వ్యవహరించారు.



దొనకొండలో లలితాదేవి అలంకరణలో అమ్మవారు

**వైపాలెంలో శాకంబరిదేవిగా..**

యర్రగొండపాలెం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు బుధవారం శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు ఉదయం విష్ణు సహస్రనామ పారాయణం, రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత కొప్పుకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ అమ్మవారి ఆలయంలో నిర్వాహకులు కె.అనంత వెంకట సుబ్రహ్మణ్యం, సి.సుబ్రహ్మణ్యం, సి.శ్రీనివాసులు పర్యవేక్షించారు.

**చంద్రఘంట అలంకారంలో త్రిపురసుందరీదేవి**

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రం త్రిపురాంతకంలోని బాలాత్రిపురసుందరీ దేవి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్ర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి ఊరేగింపు వేదపండితుల మంత్రోచ్ఛరణలతో వైభవంగా జరిగింది. పెద్దసంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొన్నారు. గురువారం కూష్మాండదుర్గ అలంకారంలో శేషవాహన సేవ నిర్వహించనున్నారు.



త్రిపురాంతకం బాలాత్రిపురసుందరీదేవి చంద్రఘంట అలంకారంలో వ్యాఘ్ర వాహనసేవ



రాజంపల్లిలో రాజ్యలక్ష్మి అమ్మవారి పూజలో పాల్గొన్న మహిళలు



వైపాలెంలో శాకంబరిదేవి అలంకరణలో దర్శనమిస్తున్న వాసవి అమ్మవారు



పెద్దదోర్నాలలో అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు

## రోడ్డు ఇలా.. నడిచేది ఎలా..?



బురదమయంగా మారిన రోడ్డు

దొనకొండ:

మండలంలోని చందవరం గ్రామం మెయిన్ బజార్‌లో వర్షం నీరు నిలిచి బురదమయంగా మారి పాదచారులు నడవడానికి కూడా వీల్లేకుండా ఉంది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు వెళ్లడానికి కూడా టైర్లు జారుతున్నాయి. వర్షం పడిన సమయంలో సుమారు 20 రోజులు రోడ్డుపై ఇలా నీరు నిలిచి బురదతో నిండిపోయి నడిచేందుకు కూడా అవస్థపడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాంట్రాక్టర్ సిమెంట్ రోడ్డు వేసినప్పుడు నాణ్యత లోపించటంతో ఈ దుస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. ఈ రోడ్డు నుంచే నిత్యం దొనకొండ నుంచి త్రిపురాంతకం వెళ్లాల్సి ఉంటుంది. అంతేగాకుండా గ్రామ ప్రజలు పొలాలకు వెళ్లాలన్నా, ఇతర పనులకు వెళ్లాలన్నా ఈ రోడ్డు నుంచే రాకపోకలు సాగించాల్సి ఉంది. ప్రత్యామ్నాయ మార్గం లేకపోయినప్పటికీ ఈ రోడ్డు గురించి అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిత్యం ఈ రోడ్డుపై నీరు నిలిచి ఉండటం వలన దోమలు వ్యాప్తి చెంది రాత్రి వేళల్లో చుట్టుపక్కల ఉండేవారికి నిద్రలేకుండా పోతోంది. అనేక సార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.